

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

గొల్లపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట సబ్-స్టేషన్‌లో 3 కి.మీ. మేర కొత్తగా వేసిన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా 33 కేవీ లైన్ వేశామన్నారు. కొత్తగా వేసిన విద్యుత్ లైన్ వల్ల ఎండపెల్లి మండలం గుల్లకోట సబ్‌స్టేషన్ నుంచి మల్లన్నపేట సబ్‌స్టేషన్ కి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్ కుమార్, ఏఈ రాకేష్ కుమార్, ఎస్ఎల్ఐ రమణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు నిధులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పిఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ నిధులను ఖర్చు చేయాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. బుధవారం విద్యాశాఖ పరిధిలో ఎంపికైన 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిరహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024- 25 సంవత్సరానికి గాను పిఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ కింద ఎంపిక కాబడిన నిధులు ఖర్చు చేసే విషయమై ఉపాధ్యాయులకు, ప్రిన్సిపల్‌లకు సూచనలు చేశారు. ప్రతి రూపాయి విద్యార్థులకు ఉపయోగపడేలా వినియోగించాలని ఆదేశించారు. సమావేశంలో ఎఫ్ఏఓ రమేష్ కుమార్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం


ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం లోని వర్షకొండ గ్రామంలో బుధవారం పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఈసందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కళ్యాణంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనానికి ప్రణాళిక



వన మహోత్సవానికి 380 నర్సరీల్లో మొక్కల పెంపకం
ఈ ఏడాది లక్ష్యం 48 లక్షలు
ఒక్కో నర్సరీలో 12,540 చొప్పున మొక్కలు

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్‌లో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. గ్రామాల్లో కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు కూలీలకు మొక్కలు పెంచడంపై ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు శిక్షణ పూర్తి చేశారు. ఉపాధిహామీ కూలీలు మొక్కల సంచుల్లో ఎరువుల మిశ్రమం కలిపి మట్టితో నింపి విత్తనాలు నాటారు. నిత్యం ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు, టీఏలు, కార్యదర్శులు గ్రామ నర్సరీలను సందర్శించి నిర్వాహకులకు తగిన సూచనలు చేస్తున్నారు.



ఒక్కో మొక్కకు రూ.8 నుంచి రూ.10 వరకు ఖర్చు

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మొక్కల పెంపకం చేపడుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీ చొప్పున మొత్తం జిల్లాలోని 380 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీకి కనీసం 12,540 చొప్పున సుమారు 48 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిల్లో ఇప్పటికే నిర్ణీత లక్ష్యం మేరకు బ్యాగుల్లో విత్తనాలు నాటారు. నర్సరీల్లో వివిధ కారణాలతో మొక్కలు ఎండిపోవడం, చనిపోవడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండడంతో లక్ష్యానికి మించి మొక్కలను పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు ఒక్కో మొక్కకు రూ.8 నుంచి రూ.10 వరకు ఖర్చు చేయనున్నారు.

33 రకాల మొక్కలు పెంపకం

ఈ యేడాది మొక్కల పెంపకానికి సంబంధించి 33 రకాల జాబితాను ప్రకటించారు. వీటిలో ఏది అనుకూలంగా ఉంటుందో వాటినే నాటాలని సూచించారు. ప్రతి ఇంటికి తులసి మొక్కను పంపిణీ చేయనున్నారు. ఇళ్ల రహదారి ప్రాంతాల్లో నీడనిచ్చే మొక్కలు, పూలు, పండ్ల మొక్కలు నాటనున్నారు. టేకు, ఈత, వెదురు, మలబారు, మునగ, వెలగ, మర్రి, వేప, బాదం, జామ, సీతాఫలం, ఖరూర, మందారా, సన్నజాజి, మల్లె, కరక్కాయ, గోరింటాకు, ఉసిరి, టెకోమా, షిషు వంటి తదితర మొక్కలకు ప్రాధాన్యమిస్తున్నారు. చాలా నర్సరీల్లో ఇంకా అడవి జాతుల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నారు. వీటిని వివిధ ప్రాంతాల నుంచి నర్సరీలకు తెప్పించారు.

మెళకువలు పాటిస్తూ..

నర్సరీల్లో మొక్కలు పెంచే క్రమంలో సరియైన అవగాహన లేక చాలా చోట్ల మొలకలు రాక రెండోసారి విత్తనాలు నాటాల్సి వస్తోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ దఫా అలా జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విత్తన శుద్ధి చేయడం, సంచుల్లో నాణ్యమైన మట్టి నింపడం, మొలకలు రావడానికి అవసరమైన ఉష్ణోగ్రత కల్పించడం, వేసవిలో ఎండిపోకుండా తరచూ నీటి తడులు ఇవ్వడం, గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేయడం లాంటి చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులు ఎప్పటికప్పుడూ సూచనలు చేస్తున్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నాం

రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి నిర్ణీత లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నాం. ఇప్పటికే మట్టిని బ్యాగుల్లో నింపి, విత్తనాలు నాటాం. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులకు శిక్షణ, సలహాలు ఇస్తూ నర్సరీలను సిద్ధం చేస్తున్నాం. కనీసం ఒక గ్రామ నర్సరీకి 10 నుంచి 12 వేల మొక్కలు పెంచాలని నిర్ణయించాం.

హైలెవల్ వంతెనలకు మోక్షమెప్పుడో..? 8
అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ 7

వైభవంగా మార్కండేయ బ్రహ్మోత్సవాలు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రలోని మార్కండేయ స్వామి ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేద మాత గాయత్రి మాతకు పంచామృత అభిషేకం, స్థాపిత దేవత హవనం, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం, శివ పార్వతుల కళ్యాణ మహోత్సవము తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మెడిపెల్లి శ్రీనివాస్ శర్మ, తిగుళ్ళ విష్ణు శర్మ, భారత్, అంజనేయులు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ప్లాటినం జూబ్లీ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ప్లాటినం జూబ్లి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. 1950 వ సంవత్సరంలో ఏడుగురి ప్రారంభం అయిన యూనియన్ 74 సంవత్సరాలు పూర్తి చేసుకొని 75 సంవత్సరంలో అడుగు పెట్టడం ఆనందదాయకమని యూనియన్ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ యూనియన్ నాయకులను, ప్రశంస పత్రాలు పొందిన ఉద్యోగులను యూనియన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణ్, సురేష్, రాజేందర్, మధుసూదన్, దేవరాజ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



కథలాపూర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్

కథలాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి ప్రమోద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌వార్డు, అవుట్ వార్డులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. వ్యాధుల నివారణకు సిబ్బంది తీసుకుంటున్న చర్యలు, ఇమ్యూనైజేషన్ కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్, ప్రోగాం మేనేజర్ రవీంధర్, వైద్యాధికారిణి సింధూజ, హెచ్ఈఓ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీవో రఘువరణ్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎస్‌ఆర్ కళాశాలలో బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. డీఆర్‌డీవో రఘువరణ్ పాల్గొని సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

'ప్లాస్టిక్ కవర్లు అమ్మితే దుకాణాలు సీజ్'



పండ్ల వ్యాపారికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో ఎవరైనా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లు అమ్మితే దుకాణాలు సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు దుకాణలలో, తోపుడుబండ్లపై మున్సిపల్ సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. సింగిల్‌యూజ్ కవర్లు వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని 4 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగులు వాడాలని తెలిపారు. దుకాణ యాజమానులు కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటి పన్ను, నల్లా బిల్ వసూలు కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పన్ను, నల్లా బిల్లు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఆర్ఓ మీర్జా అజ్మతుల్లా బేగ్, ఆర్ఐ అక్షయ్, సిబ్బంది ప్రవీణ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు తనిఖీ

ధర్మపురి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ప్లాస్టిక్ విక్రయించే పలు దుకాణాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి గౌతంరెడ్డి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్లు కలిగి ఉన్న దుకాణాలను తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే దుకాణాలకు సంబంధించిన యజమానులకు జరిమానా విధించారు. భవిష్యత్తులో దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు మహేష్, వార్డు ఆఫీసర్ వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర సమావేశం టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలైన సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరు, డీఏ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న సీడీపీవో వీరలక్ష్మి

గొల్లపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం చెందోళి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమం పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లలకు మానసిక ఆరోగ్యం, ప్రేరణ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆడపిల్లలు ప్రాథమిక దశ నుంచే నైతికతతో కూడిన విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఆడపిల్లలు సమాజ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కో ఆర్డినేటర్ శ్రావణ్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో పిల్లలు అనేక రకాల ఆకర్షణలకు లోనవుతున్నారని, వాటినుంచి బయటపడి ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకుని నిరంతరం లక్ష్య సాధన కోసం పాటుపడలన్నారు. అనంతరం మహిళా సాధికారత, బాల్య వివాహాల వల్ల ఏర్పడే దుష్పలితాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి రథోత్సవం

నల్లగొండలో వేలాది మంది భక్తుల ప్రత్యేక పూజలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కోనేరులో భక్తులు స్నానాలు చేసి దిగువ, ఎగువనున్న స్వామి వారిని తడి బట్టలతో దర్శనం చేసుకొని, బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల దర్శనార్థం మంగళవారం రాత్రి నుంచి ఆలయ ఈవో ఉడుతల వెంకన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎగువనున్న స్వామి వారిని దర్శించుకునే వీలు లేని భక్తులు రథంపైనున్న స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సాయంత్రం స్వామి వారి రథాన్ని లాగి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఎగువ, దిగువ ఆలయాల్లో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, యాగ్నీకులు శ్రీనాథ్, వరప్రసాద్‌లు ప్రత్యేక పూజలు చేశారు.

మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో కొడిమ్యాల, మల్యాల ఎస్సైలు ఎస్. సందీప్, నరేష్ బందోబస్తు నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

రాయికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్నందున పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, నల్లాల బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఎంక్రోచ్ మెంట్ ఫీజులు సకాలంలో చెల్లించాలని కోరారు.

ఘనంగా చందనోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం చందనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య స్వామి వారిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, వొద్దిపర్తి పెద్ద సంతోష్, మంధు కుమార్, చిన్న సంతోష్ కుమార్, మాజీ చైర్మన్‌లు నెరేళ్ల సుమన్, ఎనగంటి స్వామ్రాట్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కొండగట్టులో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ దొంగ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్లు అయిల్నేని సాగర్ రావు, బోయినపల్లి మధుసూధన్ రావు, మాజీ ఎంపీపీ తైదల శ్రీలత, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

పెగడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేడీసీసీబీ ఖాతాదారు చెల్లోజి సత్యం ఇటీవల మృతి చెందగా, పీఎంఎస్‌బీవై కింద మంజూరైన రూ. 2 లక్షలు చెక్కును బుధవారం అతని భార్య మాదవికి అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శంకరాచారి, అర్జున్, రాజు, కిరణ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తల్లీకూతురును హత్య చేసిన కేసులో నిందితుడు కొక్కిస వెంకటేశ్ (55)కు జీవిత ఖైదుతోపాటు 2,500 రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపల్లికి చెందిన కొక్కిస వెంకటేశ్ అలియాస్ వెంకన్న బతుకుదెరువుకోసం హుజూరాబాద్‌కు వచ్చి జీవిస్తున్నాడు. అతడి మొదటి భార్య ముప్పై ఏళ్ల క్రితం విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అనంతరం కూతురు ఉన్న రమను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆటో నడుపుకుంటూ స్థానికప్రతాపవాడలో నివాసముంటున్నాడు. తరచూ భార్య, కూతురుతో ఆర్థిక విషయాల్లో గొడవలు జరుగుతుండేవి. దీంతోపాటు వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానం పెంచుకున్నాడు. 21జనవరి 2021న రాత్రి భార్య రమ, కూతురు ఆమని (24) నిద్రిస్తుండగా ఇనుపపైపుతో తలలపై తీవ్రంగా గాయపరిచి చంపాడు. హుజూరాబాద్ పోలీసులు వెంకటేశ్‌పై కేసు నమోదు చేయగా ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి దర్యాప్తు చేపట్టారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జులూరి శ్రీరాములు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి విచారించారు.

హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

పెద్దపల్లి రూరల్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ పరిధిలోని పుట్టపల్లిలో 2016లో జరిగిన హత్యాయత్నంలో భర్త సిద్ధం చంద్రమౌళికి ఏడు సంవత్సరాల జైలు శిక్షను ఖరారు చేస్తూ పెద్దపల్లి అసిస్టెంట్ సెషన్ జడ్జి శ్రీనివాసులు బుధవారం తీర్పునిచ్చారు. 2016లో పుట్టపల్లికి చెందిన సిద్ధం చంద్రమౌళి ఓ తగాదా విషయంలో భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి పెద్దపల్లి ఎస్‌ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేయగా 8 ఏళ్ల అనంతరం కోర్టులో విచారణ కొనసాగింది. ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. ఈమేరకు పెద్దపల్లి సెషన్స్ జడ్జి శ్రీనివాసులు నిందితునికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ అడ్డగుట్ట ప్రాంతంలో దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం ఫారెస్ట్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండలానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి ముస్తఫానగర్ గ్రామ సమీపంలో మాంసాన్ని అమ్ముతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ డిప్యూటీ అధికారి అంజలి ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొనరావుపేట మండలానికి చెందిన గంట కొమురయ్య అనే వ్యక్తి దుప్పిని వేటాడి హతమార్చాడని వెల్లడించారు. దుప్పి మాంసాన్ని ముక్కలుగా చేసి ప్యాకెట్లలో కిలో చొప్పున అమ్ముతున్నట్టు అందిన పక్కాసమాచారం మేరకు ఆప్రాంతానికి వెళ్లి గాలించామన్నారు. అడ్డగుట్ట ప్రాంతంలోని ఓ చెట్టు కింద దుప్పి మాంసాన్ని కొమురయ్య విక్రయిస్తున్నట్టు గమనించి సిబ్బంది చాకచక్యంగా వెళ్లి పట్టుకున్నారని పేర్కొన్నారు. దాదాపు 33కేజీల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడైన కొమురయ్యపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. వారి వెంట బీట్ ఆఫీసర్లు రమేష్, జ్యోతి తదితరులు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు




కట్ల పర్శయ్య (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన కట్ల పర్శయ్య(68) సోమవారం పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించగా సిరిసిల్ల బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరా ఫుటేజ్ ప్రకారం కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి కోరారు.

కాలు జారిపడి ఒకరి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో ఓవ్యక్తి స్నానాలగదిలో కాలుజారి పడిపోవడంతో గాయపడి మృతిచెందాడు. పట్టణానికి చెందిన మల్లేశం (58) బుధవారం స్నానంచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే అతన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

గ్రామాల వివరాలు 'మేరీ పంచాయత్'లో..



చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏదైనా పనుల వివరాలు కావాలని అడిగితే చెప్పేవారు ఉండరు. ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పే వారు ఉండరు. విసుగు చెంది వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాల్సిన పరిస్థితి ప్రజలకు ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయత్ యాప్ ప్రవేశపెట్టింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఇతర వివరాలు ప్రజలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యాప్ ను రూపొందించింది. పంచాయతీల ఆదాయ, వ్యయం విషయాల్లో పారదర్శకత పాటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే ప్రజలు ఈ యాప్‌లో పరిశీలించవచ్చు. ఈ యాప్‌ను 2019 లో కేంద్ర ప్రభుత్వం రూపొందించగా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అందుబాటులకు తీసుకురాలేకపోయింది. ప్రస్తుతం ఈ యాప్ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

- పథకాలు, సేవల వివరాలకు ప్రత్యేక యాప్
- నిధులు, ఖర్చుల పారదర్శకతకు ప్రాధాన్యం

● గ్రామాల వివరాలన్నీ అందుబాటులో..



గ్రామ పంచాయతీల్లో విధుల వివరాలతోపాటు, కార్యదర్శి, గ్రామ కమిటీలు ఆస్తుల వివరాలు, జనాభా వివరాలు యాప్‌లో అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి యేటా పంచాయతీలకు మంజూరు చేసే నిధుల వివరాలు, పనులకు చేసిన ఖర్చు, పనులు ఏ దశలో ఉన్నాయో అనే వివరాలు యాప్‌లో నమోదై ఉంటాయి. పంచాయతీలకు మంజూరైన నిధులు కార్మికులు, సిబ్బంది వేతనాలు ఇతర ఖర్చులు యాప్‌లో పొందుపరిచారు. స్టేట్ ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ నిధుల వివరాలు కూడా యాప్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

● పనులు, నిధుల వివరాలు

పారదర్శక పాలనకు గ్రామ పంచాయతీల్లో వివిధ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటారు. నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయడంతో గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని పాలకులు భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఎన్ని మంజూరయ్యాయో, పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, వాటి చెల్లింపులు ఎంత జరిగాయి అనేది ప్రజలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. గ్రామాలకు ప్రభుత్వాలు ఎలాంటి పనులను మంజూరు చేస్తుందో ఎంత ఖర్చు చేసిందో ప్రజలు తెలుసుకోవచ్చు. పనులను చేసే సమయంలో జీపీఆర్‌ఎస్ ద్వారా పనిని గుర్తించే అవకాశం ఉంటుంది. పనులకు కేటాయించిన డబ్బులను ఇతర గ్రామాలకు వినియోగించేందుకు వీలు లేకుండా ఉంటుంది. పాలకవర్గాలు ఏలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటుంది. ప్రజాప్రతి నిధులు, అధికారులు తప్పుడు నివేదికలను రూపొందించే అవకాశం లేకుండా ప్రజలు ప్రశ్నించే వీలు యాప్ ద్వారా కలుగుతుంది. నిధుల దుర్వినియోగం జరుగకుండా, ఎంత మంజూరు అయ్యాయి ఎంత ఖర్చు చేశారనేది కూడా యాప్ ద్వారా ప్రజలు తెలుసుకోవచ్చు.

● యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

స్మార్ట్ ఫోన్‌లో ఉండే ప్లేస్టోర్ యాప్ లోకి వెళ్లి మేరీ పంచాయత్ పేరుతో వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లాగిన్ కాగానే రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలి. గ్రామాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత పంచాయతీకి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. జనాభా, ఆదాయ వ్యయాలు, చేపట్టిన పనులు, నిధులు తదితరాంశాలు అందులో అందుబాటులో ఉంటాయి. గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రతి కమిటీ వివరాలు, పనుల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

యజమాని ఇంట్లో కేర్ టేకర్ చోరీ

● నిందితుడి రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్‌క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యజమాని ఇంట్లో కేర్‌టేకర్ చోరీకి పాల్పడగా పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్‌టౌన్ ఏసీపీ వెంకటస్వామి బుధవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ సాయినగర్‌కు చెందిన రవికంటి అఖిల్ టవర్‌సర్కిల్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 9న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి దైవదర్శనానికి వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉన్నా వెనకవైపున కిటికీ పగులగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 98 గ్రాముల బంగారం కనిపించలేదు. బాధితుడు రెండో టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తనఇంట్లో పని చేస్తున్న కేర్‌టేకర్‌పై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అఖిల్ తండ్రి మనోహర్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో గర్రెపల్లికి చెందిన బెజ్జంకి సంతోష్‌ను నాలుగు నెలల క్రితం కేర్‌టేకర్ నియమించుకున్నాడు. కుటుంబ సభ్యులులేని సమయంలో సంతోష్ ఇల్లంతా తిరుగుతుండేవాడు. ఇంటి వెనుకవైపు కిటికీకి గ్రిల్‌లేదనే విషయం గమనించాడు. అవకాశం కోసం చూసిన సంతోష్ యజమాని తిరుపతికి వెళ్లడంతో బీరువా తాళాలను పగులగొట్టి లాకర్‌లో ఉన్న 98 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లాడు. అందులో కొంత విక్రయించి జల్సాలకు ఖర్చు చేశాడు. మిగతా బంగారం అమ్ముకునేందుకు కరీంనగర్‌లోని ఐబీచౌరస్తా వద్ద ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 7.45 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న రెండోటౌన్ సీఐ కె సృజన్‌రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుల్ రాజునాయక్, రాంకుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

● ఇద్దరి మృతితో పోతిరెడ్డిపేటలో విషాదం



జూపాక శ్రీహరి(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్నేహితులిద్దరూ కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లగా, మృత్యువు వారిని కాలువ రూపంలో కబళించింది. ఈ సంఘటన పోతిరెడ్డిపేట గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. జూపాక శ్రీహరి(45),రేణిగుంట సురేష్(30) మంగళవారం గ్రామశివారులోని ఉప కాలువలో ఈతకొట్టేందుకు వెళ్లారు. మొదట జూపాకశ్రీహరి కాలువలోకి దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకొనిపోయాడు. గమనించిన సురేష్ వెంటనే కాపాడే ప్రయత్నంలో నీటిలోకి దిగగా అతనుసైతం నీటిప్రవాహానికి కొట్టుకొనిపోయాడు. గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొంతమంది గ్రామయువకులు సురేష్ మృతదేహాన్ని వెలికితీయగా, జూపాక శ్రీహరి మృతదేహం ఆచూకీలభ్యం కాలేదు. బుధవారం గ్రామశివారులో కాలువ వద్ద జూపాక శ్రీహరి మృతదేహం లభ్యమైంది. స్నేహితులిద్దరి మృత దేహాలను చూస్తూ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



రాధవ్వ (ఫైల్)

పెగడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామానికిచెందిన దాసరి రాధవ్వ(85) వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలు భరించలేక వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధవ్వ మంగళవారం రాత్రి తిని పడుకుందని, బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు లేచేసరికి ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావిలోపడి మృతిచెందిందన్నారు. మృతురాలి కుమారుడు రాయమల్లు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కేసు నమోదు చేశారు.

చందాల కోసం వచ్చి వృద్ధురాలి బంగారం చోరీ



ఊట్‌పల్లిలో సీసీ ఫుటేజీలో రికార్డ్ అయిన యువతులు

కథలాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): కథలాపూర్ మండలం ఊట్‌పల్లిలో అనాథాశ్రమం కోసం చందాలు వసూలు చేస్తున్నామని నమ్మించిన ఇద్దరు యువతులు బుధవారం గజ్జెల్లి భూదవ్వ(70) అనే వృద్ధురాలి మెడలోంచి ఏడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. గ్రామస్థుల కథనం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గ్రామంలోకి ప్రవేశించిన యువతులు పలువురి ఇళ్లకు వెళ్లి చందాలు వసూలు చేశారు. అయితే ఎవరికీ రసీదు ఇవ్వలేదు. గజ్జెల్లి భూదవ్వ ఇంటికివెళ్లి చందారాయాలని అడిగి లోనికి చొరబడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి మెడపై ఉన్న ఏడుతులాల బంగారం ఎత్తుకెళ్లారు. బంగారం ఎత్తుకెళ్ళిన దొంగలు ఇంటి బయట గొళ్ళెంవేసి పారిపోయినట్టు బాధితురాలు తెలిపింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ జరిపారు. గ్రామంలోని పలు సీసీ కెమెరాల్లో రికార్డైన ఫుటేజీనిపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా బంగారం ఎత్తుకెళ్లిన యువతులు కోరుట్ల పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

రూ.3 వేల విలువైన మద్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విక్రయించేందుకు నిల్వ చేసిన రూ.3 వేల విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో మద్యం విక్రయాలపై తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడి గుర్తింపు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సాంబయ్యపల్లి గ్రామ పరిధిలో రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడిని గుర్తించినట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న సోమవారం కరీంనగర్- సుల్తానాబాద్ రైల్వేలైన్‌పై సాంబయ్యపల్లి వద్ద పట్టాలు దాటుతున్న వృద్ధుడిని కరీం నగర్ తిరుపతి వెళ్లే రైలు ఢీకొంది. వృద్ధుడి వివరాలు తెలియరాలేదు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. కరీంనగర్ ఇరుకుల్ల గ్రామానికి చెందిన ఎగుర్ల లింగయ్య(74)గా గుర్తించామన్నారు. ఇతను మానకొండూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని తన అక్క రాజమ్మను చూడడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని బోయవాడకు చెందిన ఎల్ల అన్వేష్(35)అనే వ్యక్తి కొంత కాలంగా మానసికస్థితి సరిగా లేక బుధవారం తల్లిదండ్రులపై కత్తితో దాడి చేసినట్లు మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు. అన్వేష్ తల్లి ఎల్లరమాదేవిపై దాడిచేయగా మెడ, చేతిభాగంలో గాయాలుకాగా తండ్రిగంగనర్సయ్యకు ఎడమ చేతివేలు భాగాలలో తీవ్రంగా గాయలైనట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి గంగ నర్సయ్య ఫిర్యాదు మేరకు మెంటల్‌యాక్ట్, హత్యా యత్నం సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోలో 5క్వింటాల్ల బియ్యం లభించాయన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్, ఓనర్ గంట గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న మహిళ అరెస్టు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న గంట సమ్మవ్వను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సమ్మవ్వ బుధవారం నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా పట్టుకొని ఆమె వద్ద ఉన్న 1.5 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్ షెల్టర్ నిర్మించరూ..

● బస్సు కోసం రోడ్డు పైనే పడిగాపులు ● గన్నేరువరం మండల కేంద్రంలో ప్రయాణికుల కష్టాలు



మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఓ షాపు మెట్ల పైన కూర్చొని బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గన్నేరువరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పారువెల్ల, యాస్వాడ, చొక్కారావుపల్లి, మైలారం గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల ప్రధానకూడలివద్ద బస్సుషెల్టర్ కరువైంది. దీంతో ప్రయాణికులు ఎండైనా, వానయినా రోడ్డు పక్కన ఉన్న పలుదుకాణాలను ఆశ్రయిస్తున్నారు. బస్సులకోసం గంటల తరబడి వేచిఉండే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో నిత్యంవందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు వారిబాధ వర్ణనాతీతం. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తమసామగ్రితో వేచి ఉండడానికి స్థలంలేక రోడ్డుపక్కన ఉన్న పలు దుకాణాల మెట్లపైన పెడుతూ నానాఅవస్థలు పడుతున్నారు. దుకాణాలు, హోటల్‌లవద్ద వేచి ఉంటే యజమానులు పక్కకువెళ్లాలని చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగురోడ్ల ప్రధానకూడలి వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గొర్రెగుండం అటవీ ప్రాంతంలో కలవరం

● పులి సంచారం వదంతులతో గ్రామస్థుల్లో భయాందోళన

మల్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం గొర్రెగుండం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు వదంతులు రావడం స్థానికులను కలవరానికి గురి చేస్తోంది. కొడిమ్యాల మండలం శనివారంపేట నుంచి గొర్రెగుండం వచ్చే మార్గంలో మంగళవారం మనుబోతును పులి చంపి తిన్నట్లు వచ్చిన వదంతులతో ఈప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీఅధికారులు మంగళవారం రాత్రి గ్రామంలో దప్పుచాటింపు చేయించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. మనుబోతు మృతదేహం గల ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై కొడిమ్యాల ఫారెస్ట్ రెంజర్ మొయినుద్దీన్‌ను సంప్రదించగా మనుబోతును చంపి తిన్నది పులి కాదని పులి అయితే తలపై దాడి చేస్తుందని అయితే మనుబోతు వెనకవైపు గాయాలు కనిపించాయని తెలిపారు. మనోబోతు వ్యాధితో మృతి చెందితే కుక్కలు పీక్కుతున్నట్లు అనిపిస్తోందన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పులి సంచారం, చంపినట్లు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీలోని ఉపగ్న హోమ్స్ వద్ద బుధవారం సాయంత్రం ఓ నెమలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. నెమలి పైకి ఎగిరే క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రోడ్డు వెళ్తున్న గ్రామస్థులు గమనించి వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఇల్లు విక్రయం పేరిట రూ.16.35 లక్షలు స్వాహా

● నకిలీ న్యాయవాదితో పాటు ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని జేపీనగర్‌కు చెందిన మచ్చ నారాయణకు తన కొడుకు డైవర్స్ కేసు కోర్టులో ఫైల్‌చేస్తానని నమ్మించిన నకిలీ న్యాయవాది అయిన ఏనుగు ఫణీందర్‌తో పాటు అతని భార్య ఆడెపు రజిత, మరో వ్యక్తి బొల్లి మార్కండేయలను అరెస్టుచేసినట్లు టౌన్ సీఐకృష్ణ తెలిపారు. సిరిసిల్లపట్టణం ఆటోనగర్‌కు చెందిన ఏనుగు ఫణీందర్ అనే నకిలీ న్యాయవాది మచ్చనారాయణ, అతని కుమారుడి విడాకుల కేసు వేస్తానని దగ్గరై ఇల్లు కొనుగోలు చేసినట్లు సంతకాలు తీసుకుని మోసం చేసాడన్నారు. ఇల్లు ఖాళీ చేయాలని బాధితులను వేధించడంతో బలవంతంగా నారాయణ వద్ద నుంచి 16.35 లక్షలు వసూలు చేశాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి ముగ్గురుని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఫణీందర్ బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో మత్తుపదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపైన నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో..
ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్ పరీక్షల్లో సత్తా చాటిన ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో జోనల్ ఇన్‌ఛార్జి తిరుపతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల జోనల్ ఇన్‌ఛార్జి నేదూరి తిరుపతి అన్నారు. అల్గునూర్‌లో ఎస్సార్ జూనియర్ కళాశాలలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థకు చెందిన 150మంది విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి పర్సంటైల్ సాధించారన్నారు. మెయిన్స్‌లో కొల్లూరి హాసిని, గోవిందారపు శివసాయి, ముదిగంటి రుశ్వర్‌రెడ్డి, దయ్యాల రాజ్‌కుమార్, పోగుల ఆశ్రిత, జవాజ సహస్ర, దొనకొండ సాయి, మేకల సంజన, చరణ్‌జోషి, కటకం శ్రీలేఖ 90 శాతానికిపైగా పర్సంటైల్ సాధించారన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్స్ అశోక్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగర్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మారుతి, నరోత్తమ్‌రెడ్డి, హిహెచ్‌ప్రవీణ్‌రెడ్డి, ఏవో లక్ష్మీప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్నకు
యూఎస్‌ఏ భక్తురాలు మొక్కులు



భర్తతో కలిసి రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న యూఎస్‌ఏ భక్తురాలు పీటర్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి యూఎస్‌ఏకు చెందిన పీటర్ అనే భక్తురాలు మొక్కులు చెల్లించుకుంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన వీరభద్రరావు అనేవ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీస్వామివారిని బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పీటర్ దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకుంది. తాము కుటుంబసభ్యులతో కలిసి యూఎస్‌ఏలోని సెటిల్ అయినట్లు తెలిపారు. తమ ఇంటి ఇలవేల్పు కావడంతోనే రాజన్న ఆలయానికి వచ్చినట్లు వీరభద్రరావు పేర్కొన్నారు.

అంజన్న భక్తుల గిరి ప్రదక్షిణ

మల్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు అంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానర్చకుడు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో 25వసారి నిర్వహించిన ఈ గిరిప్రదిక్షణ నూతన మార్గంలో సాగింది. కొండగట్టు గుట్టచుట్టూ ప్రదక్షిణ కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇటీవల రూ.3లక్షలు సొంతంగా అందించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో మార్గం ఇటీవల పూర్తి అయింది. దీంతో బుధవారం ఈ మార్గంలో వందలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



నైపుణ్యాల అభివృద్ధి..
భవితకు మార్గదర్శి

ఇది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ

- డిగ్రీ విద్యార్థులకు వరంగా మారిన టీఎస్‌కేసీ
- ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని పేద విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు వారి భవితకు మార్గదర్శిగా నిలుస్తోంది తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ). గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పేద విద్యార్థులకు టీఎస్‌కేసీ వరంగా మారింది. సమైక్యాంధ్ర రాష్ట్రంలో 2005లో జవహర్‌లాల్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రారంభమైనప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 నుంచి టీఎస్‌కేసీగా మారింది. విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించి వారికి కావాల్సిన మెటీరియల్ అందిస్తూ కొలువులు పొందే విధంగా టీఎస్‌కేసీ కృషి చేస్తోంది. డిగ్రీలోని బీకాం(జనరల్), బీకాం కంప్యూటర్స్, బీఏ, బీఎస్‌సీ తదితర గ్రూపుల్లోని విద్యార్థులకు రెగ్యులర్ క్లాసులతోపాటు మూడు నెలల పాటు అన్ని గ్రూపుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది.

● ప్రభుత్వ కళాశాలకే కంపెనీలు

సాధారణంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. డిగ్రీ విద్యార్థులకు ఆ అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం టీఎస్‌కేసీ ద్వారా అవకాశం కల్పిస్తోంది. డిగ్రీ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చి పలు కంపెనీలు జాబ్‌మేళాలు నిర్వహించేలా చూస్తోంది. ఇప్పటి వరకు ఐటీ, నాన్‌ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా కంపెనీలలో విద్యార్థులు డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం సాధించారు



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

● అనుభవజ్ఞులతో శిక్షణ

టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు, రీజనింగ్ అండ్ యాటిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, సామాజిక అంశాలపై అవగాహన, కరెంట్ ఎఫైర్స్, కంప్యూటర్ స్కిల్స్‌పై అనుభవజ్ఞులతో శిక్షణ ఇస్తారు. స్టేజ్ ఫియర్ ఎదుర్కోవడం, ఇంటర్వ్యూల భయం పోగొట్టేందుకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూర్, పూణే ప్రాంతాల నుంచి ట్రైనర్స్‌ను తీసుకువచ్చి శిక్షణ ఇస్తున్నారు.

● టాస్క్‌తో మరో అడుగు...

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్)తో డిగ్రీ విద్యార్థుల భవితకు మరో అడుగు ముందుకు వేసింది. హైదరాబాద్, బెంగుళూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టి చదివే స్తోమత లేని రూరల్ ఏరియా డిగ్రీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు టాస్క్ ఉచితంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నది. మొదట విద్యార్థులు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కళాశాలలో ప్రత్యేకంగా ట్రైనర్ శిక్షణ ఇస్తారు. బీటెక్ చదివిన వారితో సమానంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నది. పోటీ పరీక్షలకు సంబంధించిన వివరాలను తెలియజేయడంతో పాటు వాటికి సంబంధించిన మెటీరియల్స్‌ను ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నది.

విద్యార్థులకు ప్రయోజనం

- డాక్టర్ జైకిషన్ ఓజా, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖని



టీఎస్‌కేసీ, టాస్క్‌తో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. రెగ్యూలర్ సిలబస్‌తోపాటు టీఎస్‌కేసీ ద్వారా ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి ట్రైనర్స్ వచ్చి ప్రైవేట్ కంపెనీలలో ఏవిధంగా ఇంటర్వ్యూలను ఎదుర్కొవాలి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై థియరీ తరగతులతోపాటు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి జాబ్‌మేళాలను నిర్వహిస్తుంది.

● పేద విద్యార్థుల ఉపాధి కల్పనకు

- డాక్టర్ జి సుబ్బారావు, కోఆర్డినేటర్, టీఎస్‌కేసీ, టాస్క్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, గోదావరిఖని



పేద విద్యార్థులకు ఉద్యోగాల కల్పించేందుకు వారికి కావాల్సిన కమ్యూనికేషన్స్ స్కిల్ తదితర అంశాలపై టీఎస్‌కేసీ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ బాధ్యతను నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నా. శిక్షణ ఇవ్వడం, ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించే క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, టీఎస్‌కేసీ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు.

టీఎస్‌కేసీ కెరియర్‌కు ఎంతో దోహదపడింది.

- రుక్షిత, ఎన్‌టీపీసీ



2021లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, 2023లో కాకతీయ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాను. టీఎస్‌కేసీ ద్వారా తీసుకున్న శిక్షణ నా కెరియర్‌కు ఎంతో దోహదపడింది. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో లాబోరేటరీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాను. టాస్క్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్స్ చాలా ఉపయోగపడ్డాయి.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చేస్తున్నా..

- జక్కుల ప్రేమ్‌సాయి, గోదావరిఖని



గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2017-2020లో బీఎస్‌సీ ఎంపీసీఎస్ పూర్తి చేశాను. టీఎస్‌కేసీ ద్వారా తీసుకున్న శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఛత్తీస్‌గడ్ దంతేవాడలో పనిచేస్తున్నా. టీఎస్‌కేసీ నా కెరియర్ అభివృద్ధికి చాలా ఉపయోగపడింది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): వేములవాడలో ఈనెల 25వ తేది నుంచి 27వ వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, గత సంవత్సరం మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తిన సమస్యలను పరిష్కరించుకుని ముందుకు సాగుతామని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయపరిసరాల్లో నిర్వహించే కోడె క్యూలైన్, ఉచితటిఫిన్, భోజనం, లడ్డూ కౌంటర్, సులభ్ కాంప్లెక్స్ పార్కింగ్ ఏరియా, చలువ పందిళ్ల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 25,26,27వ తేదిల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారని తెలిపారు. సుమారు నాలుగు లక్షల మంది వరకు భక్తులు రానున్నారని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు తలె త్తకుండా పకడ్బందీ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకో వాలని అన్నారు. గతంలో జరిగిన ఇబ్బందులు ఏమైనాఉంటే వాటినిసరి దిద్దుకుని ముందుకుసాగాలని సూచించారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలనుఅందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. భక్తులు శ్రీస్వామివారిని దర్శించుకునే సమయంలో క్యూలైన్‌లోఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుం టున్నామన్నారు. మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులసమన్వయంతో ముందుకువెళుతున్నామని తెలిపారు. ఆయనవెంట ఈఈ రాజేష్, డీఈ రఘునందర్, ఏఈవోశ్రావణ్ పర్యవేక్షకులు వరినర్సయ్య, సంజీవరావు తదితరులు ఉన్నారు.



క్యూలైన్‌లను పరిశీలిస్తున్న రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ నిల్

- నేటితో ముగియనున్న గడువు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుందని, బుధవారం అభ్యర్థులెవరూ ఉపసంహరించుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, పరిశీలనలో 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, 68మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరినామినేషన్ తిరస్కరణకు గురైందని, 16మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3గంటలకు ముగియనున్నట్లు వెల్లడించారు.

- మల్కపేట జలాశయం నుంచి సాగు నీటి విడుదలకు సన్నాహాలు
- 9వ ప్యాకేజీ కాల్వ పనులు ముమ్మరం
- అన్నదాతల్లో ఆనందం



కాల్వలోని ముళ్లపొదలను తొలగిస్తున్న ట్రాక్టర్

మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండుమూడు రోజుల్లో మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు చేరుకోనున్నాయి. ఇందుకోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎగువ మానేరు జలాశయం వరకు చేపట్టిన తొమ్మిదవ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంటలు ఎండిపోకుండా చూడాలని ఇటీవల రైతులు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలకు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన సర్కారు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. నీటి పారుదల శాఖ అధికారులు కాల్వల్లోని ముళ్ల పొదలు, మరమ్మతు పనులను ముమ్మరం చేశారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు అందించేలా సన్నాహాలు చేస్తున్నారు. సాగునీరు విడుదల చేస్తారనే సమాచారంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

● యుద్ధ ప్రాతిపదికన పనులు

గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నీటి వనరులన్నీ నిండాయి. దాంతో సుమారు 16850 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి పంటలను సాగుచేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎండలు ముదరడంతో నీటి వనరుల్లో నీరు తగ్గిపోయింది. బోరుబావులు సైతం ఏకదాటిగా నీరు పోయకపోవడం వల్ల మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, రాచర్లగొల్లపల్లి, తిమ్మాపూర్, అక్కపల్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు పగుళ్ల బారుతున్నారు. కళ్ల ముందే 400 ఎకరాల విస్తీర్ణంలోని పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంటలను రక్షించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్కారు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు పనులను ముమ్మరం చేశారు. సుమారు 18.3 కిలోమీటర్ల పొడవు ఉన్న కాలువలో ముళ్లపొదలు, చెత్తాచెదారం తొలగిస్తున్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పంటలు ఎండిపోకుండా చూడాలి..

- ప్రభునాయక్, రైతు, కిష్టునాయక్‌తండా



నాకున్న మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. బోరు బావుల్లో నీరు అడుగంటడం వల్ల పొలానికి నీరు అందడం లేదు. ఎకరం పొలం పగుళ్ల చూపింది. 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చూడాలి.

సాగు నీటిని అందించాలని విన్నవించాం..

- దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పొలాలు పగుళ్ల చూపుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన వారు ప్రభుత్వానికి నివేదించారు. మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటి అందించి పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం

- కిషోర్, ఈఈ, 9వ ప్యాకేజీ

మల్కపేట జలాశయం నుంచి ఎగువ మానేరు జలాశయం వరకు 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరును అందించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మల్కపేట జలాశయంలో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఎగువ మానేరు జలాశయం వరకు నీటిని విడుదల చేయాలంటే శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి మరో 0.5 టీఎంసీ నీరు అవసరం ఉంటుంది. అందుకు ప్రభుత్వ అనుమతి తీసుకునేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. 9వ ప్యాకేజీ కాల్వను శుభ్రంచేయడంతో పాటు మట్టిని తొలగించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు ప్రధానోపాధ్యాయుడి ఎంపిక



అభయ్‌రాజ్

రాయికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర=స్థాయి సైన్స్‌సదస్సుకు మండలంలోని కుమ్మరిపెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ ఎంపికైనట్లు జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ తెలిపారు. "మనచుట్టూ ఉన్న ప్రపంచంలో విజ్ఞానశాస్త్రం" అనేఅంశంపై రాష్ట్రవ్యాప్తంగా పరిశోధనాపత్రాలు ఆహ్వానించగా జగిత్యాల జిల్లా నుంచి అభయ్‌రాజ్ రూపొందించిన పరిశోధనాపత్రం ఎంపికైంది. ఈనెల 28న రాష్ట్ర విద్యాశిక్షణా పరిశోధనాసంస్థలో రూపొందించిన "ప్రయోగశాలగా వంటశాల" పరిశోధనా పత్రం ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా అభయ్ రాజ్‌ను జిల్లా విద్యాధికారి కె.రాము, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్, మండల అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య తదితరులు అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల మండలం అంబారిపేట, తాటిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం తదితర వైదికక్రతువులు నిర్వహించారు. జగిత్యాలమండలం అంబారిపేట గ్రామంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంనందు మొదటిసారిగా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామివారి నామస్మరణతో ఆలయమంతా మారుమ్రోగింది.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

● జిల్లాలోని పలు ఆలయాల్లో వైభవంగా కల్యాణం, రథోత్సవాలు ● భక్తుల ప్రత్యేక పూజలు



మల్యాల మండలం మానాలలో రథోత్సవంలో భక్తులు



కోరుట్ల మండలం సంగెంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



తాండ్ర్యాలలో పూజల్లో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

మల్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాల శివారులో గల నల్లగుట్ట నరసింహస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం నృసింహుని రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు నృసింహుని సన్నిదిలో పూజలు జరిపారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో సీతారామస్వామి జాతర మహోత్సవం వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి రతోత్సవంను నిర్వహించారు.

లింగాపూర్‌లో..

పెగడపల్లి:లింగాపూర్‌లో శ్రీలక్ష్మీనర్సింహస్వామి రథోత్సవ వేడుకలు కన్నుల పండగగా జరుపుకున్నారు. అనంతరం భక్తులందరికి ఆలయకమిటీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

వేంకటేశ్వర ఆలయంలో కల్యాణం

కోరుట్ల: గుమ్లాపూర్ గ్రామంలోని వెంకటేశ్వర దేవాయలంలో జాతర మహోత్సవం ఘనంగా సాగింది. ప్రత్యేక పూజలలో కాంగ్రెస్ నియోజవర్గం ఇంచార్జ జువ్వాడి నర్సింగ రావు, సింగిల్ విండో చైర్మెన్ భూంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మెన్ వన్నాల అంజిరెడ్డి పాల్గొన్నారు.

●జగిత్యాల అర్బన్: జగిత్యాల పట్టణంలోని తులసి నగర్, పురాణిపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామి వారల మూల విరాట్టుకు పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని గ్రామస్థులు వైభవంగా జరిపించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు, బీజేపీ సీనియర్ నాయకురాలు బోగ శ్రావణి, నాయకులు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అరె పెద్దిరెడ్డి, కోశాధికారి మేడారపు మహేష్, ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ తోట తిరుపతి పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి, పోతారం, కలికోటలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతరోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. తాండ్ర్యాలలో పండితులు సీతారాంశర్మ నేతృత్వంలో అర్చక బృందం భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణంను కమనీయంగా నిర్వహించారు. పోతారంలో మహేశ్వర్, శేఖర్, శరత్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి కళ్యాణంను నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి జాతర

రాయికల్: ఇటిక్యాల గ్రామ శివారులోని గుట్టపై వెలసిన గుట్ట లక్ష్మీ వేంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీపాద లక్ష్మీ నరసింహ శాస్త్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరాములపల్లిలో..

గొల్లపల్లి : శ్రీరాముల పల్లె గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి కూర్మచలం సత్యానారాయణాచార్యుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారికి కళ్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు.

●భీమారం: భీమారం మండలంలోని ఒడ్యాడ్ గ్రామంలో బుధవారం సింగరాయ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకట్రావుపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి

శ్రీనివాస్, పశువైద్యాధికారి అంబారిపేట



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

●ఆంధ్ర జ్యోతి: మూగజీవాల్లో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

●వైద్యాధికారి : గాలికుంటు, నీలి నాలుక, పోచమ్మ వంటి వ్యాధులు మూగజీవాలకు సోకే ప్రమాదం ఉంది. సీజనల్‌గా వచ్చే వ్యాధుల గురించి ముందు జాగ్రత్తగా పశువులు పెంచే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరంగా టీకాలు వేసి మరణాలు జరగకుండా చూస్తున్నాం.

●ఆంధ్రజ్యోతి: పశువుల కోసం విత్తనాలు సిద్ధంగా ఉంచుతున్నారా?

●వైద్యాధికారి : పాడి పశువుల కోసం అధికంగా పాలు ఇవ్వడానికిగాను ఎస్‌హెచ్‌జీ రకం గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నాం. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ రైతులకు నాలుగు క్వింటాళ్ళ విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశాం. వనరాజా కోళ్ళ పెంపకం కోసం ఆసక్తి ఉన్న వారికి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అందిస్తాం.

●ఆంధ్రజ్యోతి: పశువుల్లో కృత్రిమ గర్భధారణ ప్రక్రియ కొనసాగిస్తున్నారా?

●వైద్యాధికారి: అధిక పాలనిచ్చే ముర్రాజాతి, జెర్సీ గేదెలు ఒంగోలు జాతి ఆవుల సంతతిని పెంచడానికిగాను కృత్రిమ గర్భధారణ ప్రక్రియను అన్ని గ్రామాల్లో కొనసాగిస్తున్నాం. ఏడాదిలో 400 హైబ్రిడ్ పశు సంపదను పెంచుతున్నాం. రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నాం.

-కథలాపూర్

మృతుల కుటుంబాలకు పరామర్శ

ధర్మపురి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణవీధికి చెందిన నందగిరి ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కొడుకులు నందగిరి మురళి, గిరిధర్, ధరణిలను బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రాంసుంధాకర్‌రావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతురాలు కొడుకులకు తన ప్రగాడ సానుభూతి తెలిపారు. అలాగే మండలంలోని తీగలధర్మారం గ్రామంలో బీజేపీ నాయకులు కంకణాల రమణారెడ్డి ఆకస్మికంగా మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, పట్టణ మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, రాయిల్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భక్తులకు వైద్య సేవలు అందించాలి'



తిప్పయ్యపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ఎస్. శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లగొండ గ్రామంలో జరుగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం తిప్పయ్యపల్లి గ్రామంలో నేషనల్ లెప్రసీ విన్ కార్యక్రమంలో బాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. చిన్న పిల్లల టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి చిన్న పిల్లలకు అందరికి టీకాలు వేసె విదంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. డేట్ ఎక్స్పైరీ లేని మందులను అవసరం ఉన్న వారికి అందించాలన్నారు. వైద్య సిబ్బంది ఆసుపత్రికి వచ్చె ప్రజలకు ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. మందులను అందుబాటులో ఉంచుకొని సేవలు అందించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంట మండల వైద్యులు పరమేశ్వరీ, నరేష్, సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్ అలివేలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది ఉన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

పెగడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనమండలిలలో పోరాటం చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎలగొండ కృష్ణహరి పేర్కొన్నారు. బుదవారం పెగడపల్లి మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 1992 నుండి నేటి వరకు కాంగ్రెస్ కార్యకర్తగా, ఎన్ఎస్‌యుఐ నుండి యువజన కాంగ్రెస్ , పార్టీ మండల శాఖ అధ్యక్షునిగా, బతికెపల్లి ఎంపీటీసీగా, ధర్మపురి నియోజకవర్గ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షునిగా, జర్నలిస్టుగా ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకునిగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని మెదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపాలని ఆయన అభ్యర్థించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయుడు అనంద్ బుధవారం తెలిపారు. అండర్ 16 విభాగంలో అకుల రామ్ చరణ్, అండర్ 18 విభాగంలో దుమ్మాల నవదీప్‌లు అథ్లెటిక్స్‌లోని లాంగ్‌జంపులో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో వచ్చె నెల హైదరాబాదులో జరిగి పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన అకుల రామ్ చరణ్, దుమ్మాల నవదీప్‌లను పాఠశాల ప్రదానోపాధ్యాయుడు అనంద్, పీడి శ్రీలతలతో పాటు ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు.

ఆలయాల్లో అన్నదానం

కొడిమ్యాల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని, మండలంలోని పూడూర్ సాయిబాబా ఆలయాల్లో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం భక్తులు గ్రామస్తులకు అన్నదానం చేశారు. అంతక ముందు సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకం, పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ 30 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చన అభిషేకలు నిర్వహించారు. ఇందులో భాగంగా సామూహిక సత్యనారయణ స్వామి వ్రతలు, కథలు అభిషేకలు జరిపారు. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పరిమి నర్సయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఆర్మూర్ నరేందర్, వాల్గొట్ పురుషోత్తం, ఆర్మూర్ రాజేష్,నాగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 25 కళ్యాణ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్-రాధిక దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్సీ పూజలు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట, రూరల్ మండలం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో 25 కళ్యాణవార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్సీకి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్సీ వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగినందయ్య, జగిత్యాల రూరల్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్, చందా రాధకిషన్‌రావు, తదితరులు ఉన్నారు.

మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దంపతుల పూజలు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట, రూరల్ మండలం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో 25వ కళ్యాణవార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జగిత్యాల మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, ఆలయకమిటీసభ్యులు మాజీజడ్పీచైర్‌పర్సన్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్లు దామోదర్‌రావు, శీలం ప్రియాంకప్రవీణ్, ప్యాక్స్‌చైర్మన్ సందీప్‌రావు, మాజీ సర్పంచులు గంగాధర్‌గౌడ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి ఆలయానికి రూ.2.87 లక్షలు ఆదాయం

పెగడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి దుకాణాల వేలం పాటల ద్వారా రూ.2 లక్షల 87 వేల 348 ఆదాయం సమకూరింది. 26న మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా 24 నుంచి 27 వరకు ఆలయ ప్రాంగణంలో దుకాణాల నిర్వహణకు గాను బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. టెంకాయలు, బెల్లం దుకాణాల నిర్వహణకు గాను రూ.1,58,116 లకు రేగుల రాజేశం వేములవాడ, లడ్డు , పులిహోర విక్రయాలకు రూ.1,14,116 లకు కాసారపు రాకేష్ వేములవాడ, టెంకాయ ముక్కలకు రూ.15,116 మల్లేశం పెగడపల్లిలు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, కమిటీ సభ్యులు రాంచంద్రం, శేఖర్, కిషన్ రావు, పార్థసారధి, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైలెవల్ వంతెనలకు మోక్షమెప్పుడో..?

-వర్షాకాలంలో గ్రామస్థులకు తప్పని తిప్పలు -నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు



పాటిమీదితండా శివారులో వర్షాలకు ధ్వంసమైన లోలెవల్ వంతెన(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 12 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలో హైలెవల్ వంతెలనకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని అల్లూరి సీతారామతండా(ఏస్సార్), పాటిమీది తండా గ్రామాల్లోని ప్రజలు ఎదురు చూస్తున్నారు. వర్షాకాలంలో ప్రతి యేటా వరదనీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. వంతెనలు దెబ్బతిన్న సమయంలో మండల కేంద్రానికి రావడానికి భీంగల్, కథలపూర్ మండలాల మీదుగా దూరభారంతో ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి యేటా వర్షాకాలంలో లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో ఎటూ వెళ్లలేక పోతున్నామని ప్రజలు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనలు, రహదారులపై ప్రయాణం చేయడానికి ప్రజలు, విద్యార్థులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు అధ్వానంగా మారిన సమయంలో బస్సు సర్వీసులు రద్దు చేస్తారు. దీంతో గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితులతో పాటు ఇతర పనులకు పట్టణాలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేయించినా ఫలితం ఉండడం లేదు. ఆయా గ్రామాల ప్రజలు సమస్యను అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అప్పటి ఎమ్మెల్యే స్వంత నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. పాటిమీదితండా గ్రామ శివారులోని లోలెవల్ వంతన స్థానంలో హైలెవల్ కల్వర్టులను నిర్మించడానికి రూ.53లక్షలు, ఏస్సాఆర్‌తండా కల్వర్టుకు రూ. 81 లక్షలు మంజూరు చేయించారు. అంతలోనే ఎన్నికలు సమీపించడంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలం రాక ముందే ఈ మార్గంలోని రోడ్డుపై హైలెవల్ వంతెనల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలు తీర్చాలి
-గుగ్లవత్ రాములు,
మాజీ సర్పంచ్ ఏఎస్సార్‌తండా

గ్రామ శివారులో ఉన్న లోలెవల్ వంతెన తొలగించి హైలెవల్ వంతెన నిర్మించాలి. వర్షాకాలం వచ్చిందంటే వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోతుంది. దీంతో వేరే గ్రామాల్లో పనులు చేసుకునే వారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే మంజూరైన హైలెవల్ వంతెనలను వెంటనే నిర్మించాలి.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి శ్రీనివాస్, పట్టభద్రుల అసెంబ్లీ కన్వీనర్ దొనికెల నవీన్‌లు కోరారు. బుధవారం పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయలు హక్కుల కోసం బీజేపీ బలపరిచిన అభ్యర్థులు నిరంతరం కృషి చేస్తారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 2వ పెండింగ్ పీఆర్సి ఫిట్మెంట్ డిఎస్ అమలలయ్యే చూస్తారని తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తారన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి వేడుకలు



జయంతి వేడుకలలో పాల్గొన్న నాయకులు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ మోచి సంఘం ఆధ్వర్యంలో బుధవారం గురూజి సంత్ రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలను నిర్వహించారు. సంఘ భవనం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా గురూజి సంత్ రవిదాస్ రథయాత్రను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మోచి సంఘం అధ్యక్షులు బైరి రాజేశ్వర్, నాయకులు సాయిలు, రాములు, గంగాధర్,మల్లేషం, మహేందర్, బైరి శ్రీనివాస్, చింతకింది భూమయ్య పాల్గొన్నారు.

కుంభమేళాలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పూజలు

జగిత్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో బుధవారం జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ దంపతులు పుణ్య స్నానం ఆచరించారు. అనంతరం స్థానిక ఆలయాలతో పాటు వారణాసిలోని ఆలయాల్లో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొర్రెలకు టీకాలు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు షీప్ ప్యాక్స్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని 780 గొర్రెలకు షీప్ ప్యాక్స్ టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో వెటర్నరీలైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, ఆఫీస్ సబార్డినేట్ అనిత, గొల్లకురుమ, యాదవ రైతులు మొగుళ్ల మల్లయ్య ఇరుమళ్లకొమురయ్య, ఎగుర్ల గంగారాం, నర్సయ్య, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి సన్మానం

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాషా సంస్కృతిక శాఖ, మీనాక్షి నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో భారతముని జయంతి ఉత్సవాలను ద్వితీయ పెరిణి నృత్యోత్సవం కార్యక్రమంను విజయవంతం చేసినందుకు గాను బీజేపీ నాయకులు సుంచు రణధీర్‌ను ఘనంగా సన్మానించారు. శాలువతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందె మారుతి, గుర్రాల గంగాధర్, ఆకుల ప్రవీణ్, విజయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విట్టంపేట వాసికి డాక్టరేట్

మెట్‌పల్లి రూరల్, ఫ్రిబవరి, 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విట్టంపేట గ్రామానికి చెందిన మునుగూరి పురుషోత్తం పీహెచ్‌డీ పూర్తి చేసి బుధవారం డాక్టరేట్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, మెట్‌పల్లిలో ఇంటర్‌మీడియట్, డిగ్రీని పూర్తి చేశానని పేర్కొన్నాడు. హైదరాబాద్‌లో వైలెంకణ్ణి కళాశాలలో బీఎడ్, ఆంధ్ర విద్యాలయంలో పీజీ(ఎంఏ తెలుగు) పూర్తి చేశారు. ఆయనను పలువురు అభినందించారు.